క్లుప్తంగా

నేడు ప్రతిభా పురస్కారాల ప్రదానం

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లా కేంద్రంలోని అనంతమారుతి గార్డెన్‌లో మున్నూరుకాపు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు ఆసంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరు అవుతారన్నారు.

విష్ణుసహస్ర, భగవద్గీత పారాయణం

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ), హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పుష్యశుద్ధ ద్వాదశిని పురస్కరించుకొని శనివారం టీటీడీ కల్యాణ మండపంలో మహిళలతో విష్ణు సహస్రపారాయణం, విద్యార్థులతో భగవద్గీతలోని 12వ అధ్యాయం భక్తియోగంపై, హనుమాన్‌చాలీసా గోవిందనామ సంకీర్తన నిర్వహించారు. టీటీడీ జిల్లా సంయోజకులు డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి భగవద్గీత ఆవశ్యకత, భగవద్గీత పఠించడంతో విద్యార్థులు కలిగే ప్రయోజనాలపై ప్రవచనం చేశారు. శ్రీలత, ఎత్తెపు కేశవులు, హనుమంతురెడ్డి, సురేష్‌చంద్‌దూత్, చంద్రకళారెడ్డి, భారతమ్మ, మంజుల, కరుణ శ్రీ, నారాయణమ్మ, పాండురంగం పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



జడ్చర్ల టౌన్: సీనియర్ సిటిజన్ ఫోరం నూతన కార్యవర్గం శనివారం ప్రమాణస్వీకారం చేసినట్లు జిల్లా అధ్యక్షుడు జగపతిరావు తెలిపారు. పట్టణంలోని ఫోరం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా నయిమొద్దిన్‌ను కొనసాగిస్తూ నిర్ణయించారు. గౌరవాధ్యక్షులుగా కె.లక్ష్మయ్య, బాద్మిశివకుమార్, ప్రధాన కార్యదర్శిగా మిరియాల వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా కొండా శ్యాంసుందర్‌లను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జగపతిరావు మాట్లాడుతూ నూతన కార్యవర్గం హయాంలోనూ సీనియర్ సిటిజనుల సమస్యల పరిష్కారం కోసం పాటు పడాలన్నారు.

అట్టహాసంగా కబడ్డీ పోటీలు



దేవరకద్ర: మండలంలోని చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయ మైదానంలో శనివారం మండల స్థాయి కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జీకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈపోటీలను నిర్వహిస్తున్నారు. ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన కబడ్డీ జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడాస్ఫూర్తితో కబడ్డీ ఆడాలని ఆయన కోరారు. ఈపోటీలు సోమవారం వరకు కొనసాగుతాయని తెలిపారు.

జగ్జీవన్‌రామ్ కాలనీలో..

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని జగ్జీవన్‌రామ్ కాలనీలో కామ్రేడ్ బాలకిష్టయ్యగౌడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9గంటలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని ట్రస్ట్ సభ్యుడు చంద్రకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులు, యువతలు, మహిళలకు ముగ్గుల పోటీలు, పిల్లలకు కబడ్డీ, ఖోఖో, కుర్చీల ఆట, పరుగు పందెం పోటీలు ఉంటాయన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

జడ్చర్ల: మండలంలోని రామస్వామి గుట్టతండాలో శనివారం క్రికెట్ పోటీలను మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యతనిచ్చి యువతను ప్రోత్సహించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య, నాయకులు శంకర్‌నాయక్, రఘుపతిరెడ్డి, ఇమ్ము తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపు నిలిపివేత

భూత్పూర్: మూసాపేట మండలంలోని సంకలమద్ది గ్రామ సమీపంలోని పందిగుట్ట నుంచి అక్రమంగా కాంట్రాక్టర్ మట్టిని టిప్పర్ ద్వారా తరలిస్తుండగా శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. సంకలమద్ది పందిగుట్ట సర్వేనంబరు 505 ప్రభుత్వ స్థలం కాగా అనుమతుల్లేకుండా టిప్పర్ల ద్వారా గుట్టను తవ్వి మట్టి తరలిస్తుండగా గ్రామస్తులు తహసీల్దార్ రాజుకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ సిబ్బంది పంపించి మట్టి తరలింపును నిలిపివేశారు.





బస్టాండ్‌లో కిటకిట

సంక్రాంతి పండుగ వేళ సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. శనివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ప్రజలు అధిక సంఖ్యలో రావడంతో సందడి నెలకొంది. ఊర్లకు వెళ్లేందుకు బస్సుల్లో సీట్ల కోసం పాట్లు తప్పలేదు. గంటల సేపు బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు బస్సులు నడిచాయి. మిగతా ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులకు బస్సులు అందుబాటులో లేవు. కాగా చార్జీల పెంపుపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

– సీనియర్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం

• ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పద్మావతికాలనీలోని గ్రీన్‌బెల్ట్‌లో వడ్డెర ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వ డైట్ కళాశాలలో ప్రొఫెసర్ జన్ను రాఘవులు జ్ఞాపకార్థం పునర్నిర్మించిన ప్రిన్సిపాల్ రూంను ప్రారంభించారు. మాడివాల మాచయ్య జయంతిని పురస్కరించుకొని వెంకటేశ్వరకాలనీలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సివిల్ ఇంజినీరింగ్‌లో ఐదుగురు విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పిస్తానన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, కౌన్సిలర్ రోజా, వడ్డెర సంఘం నాయకుడు పిట్ల యాదయ్య, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డా.మహ్మద్ మెరాజుల్లాఖాన్, జన్ను పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక ఒకటో వార్డు పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో రూ.25లక్షలతో నిర్మించే సీసీరోడ్డు, రూ.12లక్షలతో చేపట్టే కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపన చేశారు. హయగ్రీవస్వామి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 23వ వార్డు పరిధిలోని పాతపాలమూరులో రూ.63.45లక్షలతో నిర్మించిన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

భూత్పూర్: అమిస్తాపూర్‌లో శనివారం కౌన్సిలర్ తహసీన్ ఫాతిమా ఫారూఖ్ సొంత ఖర్చులతో టైలరింగ్‌లో శిక్షణ తీసుకున్న మహిళలకు ధ్రువపత్రాలతో పాటు కుటుమిషన్లను ఎంపీ డీకే అరుణ పంపిణీ చేశారు. మహిళలకు ఉపాధి కల్పించేందుకు ఉచిత టైలరింగ్ నేర్పించిన కౌన్సిలర్ తహసీన్ ఫాతిమాను ఎంపీ అభినందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ ఇంచార్జీ కొండా ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి ఉన్నారు.


ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంపీ డీకే అరుణ

వడ్డెర ఓబన్నకు ఘన నివాళి


మహబూబ్‌నగర్‌లో వడ్డెర ఓబన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వడ్డెర ఓబన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్‌అన్నారు. ఓబన్న జయంతిని పురస్కరించుకొని శనివారం గ్రీన్‌పార్క్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీచైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, వెంకన్న, ఆంజనేయులు, నాయకులు నర్సిములు, గణేష్, శివరాజు పాల్గొన్నారు.

● నవాబుపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్‌చౌరస్తాలో వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రాజు, బాల్‌రాజ్, వెంకటేష్, శ్రీకాంత్, తిరుపతయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

బస్టాండ్‌లో పోలీస్ నిఘా

• దొంగల కదలికలపై దృష్టిపెట్టిన సిబ్బంది

మహబూబ్‌నగర్ క్రైం: సంక్రాంతి పండగ వేళ ప్రయాణికుల రద్దీ పెరిగిన సందర్భంగా స్థానిక బస్టాండ్‌లో టూటౌన్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ప్రతి బస్సులో ప్రయాణికులు ఎక్కుతున్న, దిగుతున్న సమయంలో అనుమానితులు, దొంగలను పోలీస్ సిబ్బంది పరిశీలించారు. పోలీసులు మైక్ ద్వారా దొంగలు ఉంటారని, వస్తువులను జాగ్రత్తగా పెట్టుకోవాలని సూచనలు చేశారు. ఐదుగురు అనుమానిత యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో విచారించారు. ఈ సందర్భంగా సీఐ ఇజాజుద్దీన్ మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్న క్రమంలో ప్రత్యేక ముఠాలు దొంగతనాలు చేస్తుంటారని, జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళలు మెడలో ఉన్న బంగారం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసులు మఫ్టీలో కూడా బస్టాండ్‌లో విధుల్లో ఉన్నారని, షీటీం పోలీసులు సైతం నిఘా పెట్టారని సీఐ తెలిపారు.



బాదేపల్లి యార్డును సందర్శించిన మద్నూర్ మార్కెట్ బృందం

జడ్చర్ల: బాదేపల్లి ఈనామ్ వ్యవసాయ మార్కెట్ యార్డును శనివారం కామారెడ్డి జిల్లా మద్నూర్ మార్కెట్ యార్డు పాలకమండలి బృందం సందర్శించింది. ఇక్కడి మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, చెల్లింపులు, రైతులకు అందిస్తున్న సేవలు తదితర విధివిధానాలను వారు ఈసందర్భంగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పత్తి క్రయవిక్రయాలను వారు పరిశీలించారు. బాదేపల్లి మార్కెట్ పాలకమండలి చైర్‌పర్సన్ జ్యోతి, మార్కెట్ అధికారులు ఈబృందానికి స్వాగతం పలికారు. కామారెడ్డి మార్కెట్ చైర్‌పర్సన్ సౌజన్య, వైస్ చైర్మన్ పరమేశ్, డీఎంఓ రమ్య, సెక్రటరీ శ్రీకాంత్, సూపర్‌వైజర్ రాంచందర్, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

'అది మావోయిస్టుల లేఖ కాదు'

జడ్చర్ల: మావోయిస్టుల పేరుతో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని హెచ్చరిస్తూ రాసిన లేఖ నిజంగా మావోయిస్టులు రాసింది కాదని, గిట్టని వారు రాసిన లేఖ అని సంగీత అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్, మాజీ ఎంపీపీ నిత్యానందం పేర్కొన్నారు. శనివారం వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ఓ వైపు అభివృద్ధి, మరోవైపు అవినీతి నియంత్రణకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. ఇలాంటి నేపథ్యంలో ఆయనపై మావోల పేరిట ఓలేఖను రాసి భయాందోళనలు కలిగించాలన్న కుట్ర దాగి ఉందన్నారు. పోలీసుల దర్యాప్తులో అసలు విషయాలు వెలుగు చూస్తాయన్నారు. మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి సంబంధించి మావోయిస్టుల పేరుతో వచ్చిన లేఖలోని ఆరోపణలపై వాస్తవాలను ప్రజలకు వివరించాలని జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి బాలవర్దన్‌గౌడ్ డిమాండ్ చేశారు.

రాజాపూర్: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిపై గిట్టనివారు మావోల పేరుతో లేఖరాసి బురద జల్లేందుకు చూస్తున్నారని రంగారెడ్డిగూడ గ్రామస్తుడు కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అశోక్, వేణాచారి, శివశంకర్‌గుప్తా పాల్గొన్నారు.



మిడ్జిల్: జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిపై శుక్రవారం రంగారెడ్డి గూడ గ్రామంలో మావోయిస్టుల పేరిట వెలిసిన లేఖ అవాస్తవమని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో డీసీసీ నాయకులు సాయిలు. మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు గౌస్, రాజారెడ్డి, సంపత్, సత్యం, ఉస్మాన్, పర్వతాలు, నరేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు కృష్ణ, శివ ఉన్నారు.

ఇష్టంతో చదవాలి

కోయిల్‌కొండ: విద్యార్థులు ఇష్టంలో చదవాలని శ్వేతావిద్యామందిర్ కరస్పాడెంట్ నరేందర్‌జీ అన్నారు. శనివారం మండలంలోని పారుపల్లిలోని ఆపాఠశాలలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పీఈటి వీరయ్య ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ రూరల్: మదారి కురువ ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ధన్వాడ రాములు సమక్షంలో ఈకార్యక్రమం నిర్వహించారు. సంఘం కన్వీనర్ నాగరాజు, కోకన్వీనర్ శ్రీశైలం, వేణుగోపాల్, వెంకట్రాములు, శివన్న, వేణుగోపాల్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా గంగన్న

మహబూబ్‌నగర్ రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ మండలాధ్యక్షుడిగా మనికొండ గ్రామ తాజా మాజీ సర్పంచ్ గంగన్నను ఆపార్టీ నియమించింది. ఈమేరకు శనివారం ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ ప్రకటించారు. పార్టీ మండలాధ్యక్షుడిగా తనను నియమించినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తపేటలో శకటోత్సవం

హన్వాడ: మండలంలోని కొత్తపేట గ్రామంలో శనివారం దాసాంజనేయస్వామికి శకటోత్సవాన్ని నిర్వహించారు. స్థానికులు తమ ఎడ్లబండ్లను అందంగా అలంకరించుకుని దాసాంజనేయ స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అరుణ్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాసులు, అంజిలయ్య పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

దేవరకద్ర: మండలంలోని గోపన్‌పల్లిలో ఆదివారం ఉదయం 10 గంటలకు వైద్యనిపుణుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సురేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సందయ్య నారాయణరెడ్డి, రుక్నమ్మల జ్ఞాపకార్థం ఈక్యాంపును నిర్వహిస్తున్నామన్నారు. గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఈక్యాంపు ఏర్పాటుచేశామని, పరీక్షలు చేసి మందులు అందజేస్తామన్నారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభించడానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరు అవుతారని తెలిపారు.

● గోపన్‌పల్లి గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్‌పోటీలు ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు చత్రపతి ఉత్సవ సమితి అధ్యక్షుడు కుమ్మరి బుచ్చన్న తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గెలుపొందిన విజేతలకు మొదటి, ద్వితీయ బహుమతులు రూ.20వేలు, రూ.10వేలు అందిస్తారన్నారు. ఆసక్తి కలవారు సెల్‌నంబర్ 8555955063కు సంప్రదించాలని ఆయన కోరారు. కమిటీ సభ్యులు నందీశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, దశరథ, రాజు, రమేష్, వరుణ్, రవి, నరేందర్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

జడ్చర్ల: మండలంలోని గంగాపూర్ గ్రామంలో శనివారం డిగ్రీ విద్యార్థిని పల్లవి(20) ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్‌లో డిగ్రీ చదువుతున్న ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని విచారించారు. కూతురు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు లక్ష్మమ్మ, శ్రీనివాసులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెడ్‌క్రాస్ సేవలు భేష్

పాలమూరు: జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయమని ఆసంస్థ రాష్ట్ర చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా అన్నారు. మహబూబ్‌నగర్ పర్యటనలో భాగంగా శనివారం మొదట ఏనుగొండలో ఉన్న సన్నిధి ఆశ్రమాన్ని, శాంతివన్ మానసిక వికలాంగుల కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆశ్రమంలో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను, విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిపై ఆరాతీశారు. కాసేపు విద్యార్థులతో ముచ్చటించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంపిణీచేశారు. అనంతరం జనరిక్ మెడికల్ దుకాణం, బ్లడ్ బ్యాంకును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, డాక్టర్ శ్యాముల్, జగపతిరావు, రమణయ్య, తిరుపతిరెడ్డి, బాబుల్‌రెడ్డి, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.


అంధ విద్యార్థి కంప్యూటర్ స్కిల్‌ను పరిశీలిస్తున్న రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ అజయ్ మిశ్రా

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటుంది. ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు నిర్వాహకులు వినోద్ తెలిపారు. ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడ మూగా, ఎరిశిల్క్స్, బీహార్ జగల్పూర శిల్క్స్, టస్సర్, చత్తీస్‌ఘడ్ ట్రిబిల్ వర్క్స్, కోసా శిల్క్స్, గుజరాత్ బాందిని, కచ్చ ఎంబ్రాయిడరీ డ్రెస్, శారీస్, జమ్ముకశ్మీర్ ఎంబ్రాయిడరీ శారీలు, డ్రెస్ మెటీరియల్స్, శాల్, కర్ణాటక క్రేప్ ప్రింటెడ్ శారీలు, డ్రెస్ మెటీరియల్స్, మధ్యప్రదేశ్ చందేరి, రాజస్తాన్ కోటా, బ్లాక్‌ప్రింట్స్, తెలంగాణలోని గద్వాల, నారాయణపేట, పోచంపల్లి, ఉత్తర ప్రదేశ్ జమ్దాని, బనారస్ లక్నోని, హర్యానా బెడ్‌క వర్లు, కుషన్ కవర్లు, లక్నోవి, కుర్తీస్, డ్రెస్ మెటీరియల్స్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రజలు చేనేత హస్తకళా ప్రదర్శనను తిలకించాలని ఆయన కోరారు.


టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన చేనేత హస్తకళా ప్రదర్శన (మస్ట్)

క్రమశిక్షణతో ముందుకు సాగాలి

నవాబుపేట: యువత క్రమశిక్షణతో ముందుకు సాగాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఎన్‌పీఎల్ క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడలతో నేర్చుకున్న క్రమశిక్షణతో నవసమాజస్థాపనలో భాగస్వాములు కావాలన్నారు. వివేకానందుడు చూపిన మార్గంలో యువత నడవాలని అన్నారు. ఎన్‌పీఎల్ విజేతలకు మొదటి బహుమతి కప్‌తోపాటు రూ.20 వేల నగదు, ద్వితీయ బహుమతి రూ.15వేల నగదును అందిస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో వ్యాపార సంఘం మండలాధ్యక్షుడు సుధాకర్‌చారి, నవాబుపేట డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు అంజయ్య, జేకే ట్రస్ట్ సభ్యులు లక్ష్మిదేవి, గీతారాణి, యువజన సంఘాల నాయకులు శ్రీనివాస్, ఆంజన్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటమే గెలుపునకు నాంది..

రాజాపూర్: నేటి ఓటమే రేపటి గెలుపునకు నాంది అని రంగారెడ్డిగూడ మాజీ సర్పంచ్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తల్లి జనంపల్లి శశికళారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కల్లేపల్లిలో దివంగత పీఏసీఎస్ చైర్మన్ జగన్నాథ్‌రెడ్డి స్మారక క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్లను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు. భరత్‌కుమార్‌రెడ్డి, వెంకటర్‌రెడ్డి, గోనెల రమేష్, శ్రీధర్‌రెడ్డి రమణ, గోవర్ధన్‌రెడ్డి, పవన్, రామాంజనేయులు పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ శశికళారెడ్డి తదితరులు

ముగ్గుల పోటీలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని అక్షరకాన్సెప్ట్ స్కూల్ ఆవరణలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థుల తల్లులు పోటీలో పాల్గొని సంక్రాంతి పండగ విశిష్టతలను ప్రతిబింబించేలా ముగ్గులు వేశారు. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత ప్రారంభించి ప్రసంగించారు. సంక్రాంతి అనగానే రంగు రంగుల రంగవల్లులే గుర్తుకు వస్తాయని, మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిఒక్కరూ భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అక్షరస్కూల్ చైర్మన్ పడాల రేణుక పాల్గొన్నారు.



ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో..

మారుతీనగర్‌లో ఆర్ఎస్ఎస్ కార్యాలయం మాధవీయంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డుకౌన్సిలర్ జ్యోతి, వీహెచ్‌పి జిల్లా ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, నగర అధ్యేఉడు అఖిల్‌రెడ్డిలపాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జెడ్పీహెచ్ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని ఉత్సవాల కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శనివారం హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన పూర్వవిద్యార్థుల సమావేశంలో కోఆర్డినేషన్ కమిటీసభ్యులు వి.కృష్ణ, రమణాచార్యులు, సయ్యద్ ఇబ్రహీం వివరాలను వెల్లడించారు. ఈ ఉత్సవాలు విజయవంతం కావాలంటే ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సహకారం అవసరమని, ఆయనను త్వరలోనే కలుస్తామని అన్నారు. ముందుగా 1925 నుంచి 2018 వరకు చదివిన విద్యార్థుల వివరాలు సేకరించాలని, అందుకు గానూ వివరాల సేకరణకు సంతోష్‌చారి, శ్రీహరిల నేతృత్వంలో కమిటీని నియమించినట్లు తెలిపారు. వీటితో పాటు ఉత్సవాలను విజయవంతంచేసేందుకు పలు కమిటీలను ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. సమావేశంలో వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులతోపాటు పూర్వ విద్యార్థులు ఆనంద్, పరమటయ్య, డా.రాఘవేందర్, అయూబ్, తాహెర్, గోపాల్, రంగభాను, ఉమాశంకర్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


బాదేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

అదృశ్యం కేసులపై దృష్టి

నవాబుపేట: అదృశ్యమైన మహిళలు, పిల్లలు, వ్యక్తుల కేసులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మిస్సింగ్ కేసుకు సంబంధించి ఫిర్యాదు అందితే 24 గంటల్లోనే ఎస్ఐ ప్రత్యేక చొరవ తీసుకొని ఛేదిస్తున్నారు. గత వారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను ఒకడు పూణేకు తీసుకెళ్లాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో వారిని 24గంటల్లోనే పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నెల రోజుల వ్యవధిలో మండలంలో 4 మిస్సింగ్ కేసులు కాగా వాటిని రెండు రోజుల్లోనే ఛేదించారు.

● మండలంలోని కాకర్లపహాడ్‌కు చెందిన వివాహిత రెండేళ్ల క్రితం అదృశ్యమైంది. దీంతో 2023 మార్చి 12న ఆమె బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పట్లో కేసు నమోదు చేశారు. తాజాగా ఎస్ఐ విక్రమ్ అన్ని మిస్సింగ్ కేసులు పూర్తిచేస్తున్న తరుణంలో ఈ కేసును సైతం ఛేదించారు. అదృశ్యమైన వివాహితను శనివారం బంధువులకు అప్పగించారు.

108 రకాల సారెతో మన్యంకొండకు మహిళలు

దేవరకద్ర: స్థానిక వాసవీ కన్యాకపరమేశ్వరి దేవాలయం ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలు 108 రకాల సారె, ఒడి బియ్యంతో శనివారం మన్యంకొండకు తరలి వెళ్లారు. ధనుర్మాసం పురస్కరించుకుని మన్యంకొండ అలివేలు మంగమ్మ దేవాలయంకు మహిళలు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 108 రకాల పిండి వంటలతో తయారుచేసిన సారే, ఒడిబియ్యాన్ని అమ్మవారికి సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కల్వ కన్నయ్య, మహిళా ప్రతినిధులు మంజులారాణి, కమలమ్మ, వెంకటేశ్వరమ్మ, పావనీ, పాల్గొన్నారు.

